తొళ్లూరు నాగేశ్వరరావు  ఆధునిక నీతికథలు

తెనాలి చాలామంది వెళ్లి వుండొచ్చు. కాని నందులపేటలో నాలుగురోడ్ల కూడలిలో నిద్రగన్నేరు చెట్టును కొద్దిమంది మాత్రమే చూసివుంటారు. ఆ చెట్టు ప్రత్యేకత అట్టే లేదనుకోండి. ఆ చెట్టుకింద ఓ టీ దుకాణముంది. ఆ ప్రాంతపు రిక్షావాళ్లంతా ఖాళీసమయాల్లో కాలక్షేపంకోసం అక్కడ చేరతారు. టీ దుకాణం పక్కనే కిళ్లీకొట్టు.

ఆ చెట్టుకు ఎదురుగ్గా రాజారావుగారి మూడంతస్థుల మేడ ఉంది. దాని పక్కనే కోటయ్య కట్టెల అడితీ వుంది. మూడు దశాబ్దాల క్రితం రాజారావు రిక్షావాలా! ఆ తర్వాత మూడు రిక్షాలకు యజమానియై, రిక్షా ఓనర్స్ అసోసియేషన్‌కు అధ్యక్షుడై, పదిరకాల వ్యాపారాలు చేసి, పది లక్షలు ఆర్జించి, అంత పెద్ద మేడ కట్టాడు. ప్రస్తుతం మున్సిపల్ కౌన్సిలర్ కూడా. అంతేకాకుండా ఏ ప్రభుత్వం మారినా, ముఖ్యమంత్రి ఎవరొచ్చినా కొన్ని పరిధులమేరకు అతని ఇన్‌ఫ్లుయన్స్ చెక్కుచెదరకుండా వుంటోంది. టవున్లో ఏ ఆర్.డి.వో వున్నా ఏ సబ్-జడ్జి వున్నా, ఏ సర్కిల్ ఇనస్పెక్టరున్నా, ఏ మునిసిపల్ కమీషనర్ వున్నా వాళ్ల దయదాక్షిణ్యాలను వారంరోజుల్లో పొందగల నేర్పూ, నైపుణ్యమూ రాజారావు కున్నాయి. ఆ అధికారబలాన్ని పొందడానికి ఎన్నిమార్గాలు అతను అవలంభిస్తాడో, తద్వారా సొమ్ము సంపాదనకు అంతకు రెట్టింపు మార్గాలు అవలంభిస్తాడు. డబ్బు సంపాదన ముందు వెలుగు, చీకటి; నీతికి, అవినీతి, మర్యాద, అమర్యాద ఒకటే అతని దృష్టిలో. ఆఫీసర్లను ఆకట్టుకోవడానికి అందమైన తన భార్య శీలాన్ని అతను ఖాతరుచేయడని కూడా కొంతమంది చెప్పుకుంటారు.

కాని మూడు దశాబ్దాల క్రితం కోటయ్య ఎట్లావున్నాడో ఇప్పుడూ అట్లాగే వున్నాడు. కాకపోతే ఆ అడితీలో పనికుర్రాడుగా చేరి, కట్టెలు కొట్టి, ఆ అడితీ యజమాని చనిపోయాక, ఆ అడితీని సొంతం చేసుకున్నాడు. రేకులతో ఒక చిన్న ఇల్లును కట్టుకున్నాడు. ఆ తర్వాత ఒక చక్కని చుక్కను పెళ్లి చేసుకున్నాడు. అయితే చక్కనిచుక్క స్కూల్‌ఫైనల్ ప్యాసుకాలేదు గానీ అంతవరకు చదువుకుంది. ఆ చుక్క చక్కదనానికి కోటయ్య పాదాక్రాంతుడై ఆమె మోజులన్నింటికీ ఖర్చుపెడుతూ రాసాగాడు. కోటయ్య పెళ్లానికి

స్నో, పౌడర్లు, సబ్బులు, వాసననూనెలు మొదలైన వాటిమీద మక్కువ ఎక్కువ. సినిమాలంటే పంచప్రాణాలు. మంచి మంచి చీరలు ధరిస్తుంది— ఎప్పటికైనా సినిమాలో 'ఎక్స్ట్రా' వేషమైనా వేయాలనేది ఆమె జీవితాశయం. ఆ జీవితాశయం నెరవేరాలంటే కట్టెలుకొట్టు కోటయ్య మూలవిరాట్టు కాడు. అందుచేత ఆ వీధిన యన్ఫీల్డ్ మోటారుసైకిలుమీద పోయే ఓ లాడ్జి ప్రొప్రైటరు సుబ్బారావును ఆకర్షించక తప్పలేదు.

ఆమె అందాన్నీ, వయస్సునూ, అభిలాషనూ, వలపు సోయగాన్నీ సుబ్బారావు గ్రహించి, వలలో వేసుకొని, లాడ్జికి రప్పించి, ఓ గంటసేపు శారీరక సుఖాన్ని చూపెట్టి, తన మిత్రులు ముగ్గురు సినిమా నిర్మాతలనీ, ఒక సినిమాలో వేషం ఇప్పిస్తాననీ ఆమె మనస్సులో ఆశలసౌధాన్ని నిర్మించాడు. అప్పట్నుంచీ కోటయ్య పెళ్ళాం సుబ్బారావుకూ, సుబ్బారావు లాడ్జికీ, సినిమా ప్రొడ్యూసర్గా దర్జాగా వెలిగించేవాళ్ళకూ అలవాటుపడింది.

ఈ విషయం కోటయ్యకు చూచాయగా తెలిసేటప్పటికి కథ చాలామారం పోయింది. ఆమెను 'అలా చేయొద్దు' అని బతిమాలాడుగానీ, 'నీ వాళ్ళ చీరుస్తా' అని బడితెపూజ చేయలేకపోయాడు. కోటయ్య బతిమాలింపును ఉదయం సబ్బుతో మొహం కడుక్కున్నట్టు తుడిచివేసింది కోటయ్య పెళ్లాం. పై పెచ్చు కోటయ్య ఊళ్లోలేనప్పుడు అడపాదడపా ప్యాసింజర్లు రాత్రిపూట ఇంటికే రావడం మొదలెట్టారు.

కోటయ్య పెళ్లాంసంగతి రాజారావుకు తెలుసు. రాజారావుభార్య ఏమీ పట్టించుకోలేదుగానీ రాజారావుమాత్రం ఇంటిపక్కన వ్యభిచారం జరుగుతూండటాన్ని సహించలేని అవినీతిచర్యగా భావించాడు.

ఆరోజు రాత్రి రాజారావు కొత్తగా టవున్లోకి వచ్చిన సర్కిల్ ఇన్స్పెక్టరుకు డిన్నర్ ఇచ్చాడు. ఆ డిన్నర్కు ముందు పన్నెండేళ్ల ప్రాయంగల 'వాలెంటైన్' స్కాచ్విస్కీని భార్యచేతనే గ్లాసుల్లో పోయించాడు. సోడాలు, ఫిష్కట్లెట్, బాదంపప్పు మొదలైనవి రాజారావు భార్యే స్వయంగా సర్వ్ చేసింది. ఆ తర్వాత డిన్నర్ కూడా ఆమె స్వహస్తాలతోనే వడ్డించింది. అటు పిమ్మట రాత్రి పదిన్నరనుంచి పదకొండున్నరవరకు ఆమె మేడపైన పడక గదిలో సర్కిల్ ఇన్స్పెక్టరుగారి బాహుబంధాల్లో 'డన్లప్ పిల్లో'లా వుండిపోయింది.

ఆ సమయంలో రాజారావు బాల్కనీలో నిలబడి గోల్డుఫ్లేక్ సిగరెట్టు కాలుస్తూ, కోటయ్య అడితీముందు రిక్షా ఆగడం, అందులోనుంచి లాల్చీ, లుంగీ

ధరించిన ఓ వ్యక్తి కోటయ్య ఇంట్లోకి పోవడం చూశాడు. వెంటనే సబ్ ఇన్‌స్పెక్టరుకు ఫోన్‌చేసి, కోటయ్య ఇంటి అడ్రసుచెప్పి, అక్కడ జరుగుతూన్న వ్యభిచార కార్యకలాపాన్ని వెంటనే అరికట్టాలని, లేకపోతే పోలీసుశాఖకి అప్రదిష్ఠ వస్తుందనీ, సర్కిల్ ఇన్‌స్పెక్టరుగారు నిముషాలమీద చర్య తీసుకోమన్నారనీ చెప్పాడు.

అరగంటలో సబ్ ఇన్‌స్పెక్టరూ, ముగ్గురు పోలీసులూ వచ్చి కోటయ్య ఇంటిమీద దాడిచేసి, పరపురుషుని కౌగిలిలోవున్న కోటయ్య భార్యనూ, ఆ పరపురుషుణ్ని పోలీసు స్టేషనుకు తీసుకెళ్లారు.

ఆ రోజు కోటయ్య ఇంట్లో లేడు. చుట్టాలింటికి మంగళగిరి వెళ్లాడు.

కోటయ్యపెళ్లాన్నీ, షోకిల్లా పురుషుడ్నీ పోలీసులు పట్టుకెళ్లడం చూసి కడుపుబ్బ నవ్వుకున్నాడు రాజారావు.

*గొప్పవాడి భార్య పతివ్రతగా ఉండటంకంటే పేదవాడి పెళ్లాం పతివ్రతగా ఉండటం ఎక్కువ కష్టం.*


